రిమ్కోలియన్‌కు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): చాలాకాలం తర్వాత ఒక రిమ్కోలియన్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సంపాదించాడు. డెహ్రాడూన్‌లోని ప్రతిష్టాత్మక రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ)లో చదివిన విద్యార్థులను రిమ్కోలియన్స్‌గా పిలుస్తారు. నగరానికి చెందిన చేపూరి అవినాష్ తన 13వ ఏట రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో ప్రవేశం పొందాడు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాతపరీక్ష ద్వారా ఇంటర్వ్యూకు ఎంపికయ్యాడు. అక్కడ చదువు, శిక్షణ అనంతరం 2024లో మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందాడు. 2017లో ఉత్తరాఖండ్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ గెలవడం నుంచి, 2023లో తెలంగాణ చీఫ్ మినిస్టర్ కప్‌లో సిల్వర్ మెడల్ అందుకోవడం వరకు అవినాష్ అనేక పతకాలను గెలుచుకున్నాడు. 2019లో ఆర్ఐఎంసీ నుంచి మెరిట్ కార్డ్ మరియు హాఫ్-బ్లూ పురస్కారాలను అందుకున్నాడు. జాతీయస్థాయిలో 2021 నార్త్ జోన్ ఎయిర్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో జూనియర్, యూత్ కేటగిరీల్లో నేషనల్ చాంపియన్ షిప్‌కి అర్హత సాధించాడు. 2022, 2023లో 65వ, 66వ నేషనల్ షూటింగ్ చాంపియన్ షిప్‌లలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించి నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఎఐ) నుంచి 'రి నౌన్డ్ షాట్' గా అర్హత పొందాడు.

మార్చిలో పదో తరగతి పరీక్షలు

ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): పదో తరగతి వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చిలో జరగనున్నాయి. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఆలస్య రుసుము లేకుండా 18లోగా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్ష ఫీజుగా రూ.125 చెల్లించాలని తెలిపారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 2, రూ. 200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 21 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని సూచించారు. ఫీజులను పాఠశాల హెచ్ఎంలకు చెల్లించాలని, వారు బోర్డుకు చెల్లించాలని వెల్లడించారు.

క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్ అవాస్తవం

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్ వార్తలపై ఇంటర్‌బోర్డు స్పందించింది. క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్ వార్త నిజం కాదని, జరుగుతున్న ప్రచారమంతా అవాస్తవమని ఇంటర్ బోర్డు కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్‌పై సోషల్ మీడియాలో పుకార్లు, మీడియాలో వార్తలు రావడంతో శుక్రవారం వివరణ ఇచ్చారు.

టెట్‌కు 775 దరఖాస్తులు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గురువారం రాత్రి నుంచి దరఖాస్తుల స్వీకరణ షురూ కాగా, శుక్రవారం వరకు 775 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. తొలి రోజు పేపర్-1కు 214, పేపర్-2కు 431, రెండు పేపర్లకు 130చొప్పున మొత్తం గా 775 దరఖాస్తులొచ్చినట్టు అధికారులు తెలిపారు. ఇక ఫీజును ప్రభుత్వం తగ్గించింది. ఒక పేపర్‌కు రూ.వెయ్యి ఉండగా, రూ.750కి తగ్గించింది. రెండు పేపర్ల ఫీజును రూ. వెయ్యికి తగ్గించింది.

ఫార్మసీకి పుల్లు డిమాండ్

96శాతం నిండిన సీట్లు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): బీ ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సులకు డిమాండ్ ఏటా పెరుగుతున్నది. ఈ కోర్సుల్లోని సీట్లు హాట్‌కేకులను తలపిస్తున్నాయి. తుది విడత కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగియగా, ఫార్మసీ కోర్సుల్లో 11,060 సీట్లకు 10,692(96.7)శాతం సీట్లు భర్తీఅయ్యాయి. ఎప్‌సెట్ బైపీసీ విభాగంలో ఈ ఏడాది 82,163 మంది క్వాలిఫై అయ్యారు. వీరిలో 17,201 మంది ఫార్మసీ కౌన్సెలింగ్‌కు హాజరుకాగా, 10,692 మంది సీట్లు దక్కించుకున్నారు. తుది విడత సీట్ల కేటాయింపు ముగిసిన తర్వాత 60 కాలేజీల్లో వంద శాతం సీట్లు నిండాయి. ఐదు కోర్సుల్లో కలిపి 368 సీట్లు మాత్రమే మిగిలాయి. సీట్లు పొందినవారు 12లోగా కాలేజీల్లో రిపోర్టుచేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ఏ దేవసేన సూచించారు.

గాంధీభవన్ పక్కన ఉన్న భీంరావ్‌బాడలో 2008లో ఇండ్ల కూల్చివేతతో రోడ్డున పడ్డ కుటుంబం

భీంరావ్‌బాడలో ఇండ్లను కూల్చివేయడంతో సామగ్రితో వీధినపడిన కుటుంబాలు

నాటి బుల్డోజర్ జాడ.. భీంరావ్‌బాడ!

మొదటిపేజీ తరువాయి...

ఇండ్ల సముదాయంలోకి తరలించారు. ఆ నిరుపేదలకు 1995లో అప్పటి స్థానిక, ఆసిఫ్ నగర్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలోనే ఇండ్ల పట్టాల పంపిణీ జరిగింది. కరెంటు మీటర్లు, మంచినీటి కనెక్షన్లు, రేషన్‌కార్డులు ఇచ్చారు. అదే చిరుమానాపై ప్రభుత్వ పథకాల అమలు కూడా జరిగింది. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం లేకుండా ఆ నిరుపేదల ఇండ్లను కూల్చింది. 2006 నుంచి కాంగ్రెస్ పార్టీ ఆ బస్తీపై కక్షగట్టడంతో బస్తీవాసులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. స్టేను కొనసాగించుకోవాలనే అవగాహన బస్తీవాసుల్లో పెద్దగా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని అప్పటి కాంగ్రెస్ సర్కారు స్టే వెకేట్ అయిన రోజు అర్ధరాత్రి బుల్డోజర్లతో విరుచుకుపడింది. నగరం నడిబొడ్డున ఉండటంతో అప్పటివరకు వారికి ఉపాధి లభించేది. పిల్లల చదువులకు ఇబ్బంది ఉండేది కాదు. కానీ అక్కడి నుంచి తరలిపోయిన తర్వాత ఆ కుటుంబాల చెల్లాచెదురై, నరకయాతన అనుభవిస్తున్నాయి.

కార్యాలయం కోసమే దమనకాండ

ఇంతకీ ఆ నిరుపేదల గూడును బుల్డోజర్ల కింద తొక్కిచేందుకు కారణం ఏమిటో తెలుసా? అక్కడ ఇందిరా భవన్ పేరిట కాంగ్రెస్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించడమే. పేదల ఇండ్లను కూలగొట్టి అక్కడ పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకోవాలని ఈ దమనకాండకు ప్రభుత్వం పాల్పడింది. ఆ ఘటనకు మరో నెల రోజుల్లో పదహారు సంవత్సరాలు నిండుతాయి. కానీ, ఇప్పటిదాకా ఇందిరా భవన్‌ను నిర్మించిందీ లేదు, ఆ స్థలాన్ని ఇతర ప్రజా ప్రయోజనాలకు వినియోగించిందీ లేదు. అటు పేదలకు దక్కలేదు. చివరకు ప్రభుత్వం వాడుకోలేదు. కానీ 75 సంవత్సరాలనాటి బస్తీ కాలగర్భంలో కలిసిపోయింది. మూసీ సుందరీకరణ పేరిట ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మళ్లీ నిరుపేదల ఇండ్లను కూల్చి ఆకాశహర్మ్యాలు నిర్మిస్తానని చెప్తుండడంతో ప్రస్తుతం భీంరావ్‌బాడ దీనగాథను హైదరాబాద్ నగరం నెమరేసుకుంటున్నది.

భీంరావుబాడలో వంద కుటుంబాలు

సిద్దిపేట, దుబ్బాక, సిరిసిల్ల, వేములవాడ తదితర ప్రాంతాల నుంచి నిరుపేదలు నగరానికి వలస వచ్చి నాంపల్లిలో గాంధీభవన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవించేవారు. దీంతో 1933లోనే అక్కడ భీంరావుబాడ అనే బస్తీ ఏర్పడింది. నాంపల్లిలో నిర్మాణరంగ కూలీల అడ్డా ఉన్నందున అక్కడికి సమీపంలోనే ఉపాధి దొరుకుతుందనే ఆశతో అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలా సుమారు 1100 చదరపు గజాల స్థలంలో దాదాపు వంద కుటుంబాల వరకు అక్కడ స్థిరపడ్డాయి. నాటి ఆసిఫ్‌నగర్ ఎమ్మెల్యే దానం నాగేందర్ 1995 సంవత్సరంలో వీరికి పట్టాలను కూడా పంపిణీ చేశారు. రేషన్‌కార్డులతో పాటు విద్యుత్తు, మంచినీటి కనెక్షన్లు కూడా పొందారు. నగరం నడిబొడ్డున ఉండటంతో వారికి మంచి ఉపాధి లభించేది. పిల్లల్ని

ఇల్లు కోల్పోయిన బాధితురాలు(ఫైల్)

పాఠశాలలకు పంపడంతో పాటు పైసాపైసా కూడబెట్టుకొని కొందరు గుడిసెల స్థానంలో చిన్నపాటి ఇండ్లను కూడా నిర్మించుకున్నారు. ఇంట్లో టీవీ, కొంతమేర ఫర్నిచర్‌తో ఆ కుటుంబాలు అక్కడ సంతోషంగా జీవించాయి.

కన్నేసిన కాంగ్రెస్

గాంధీభవన్ పక్కనే ఉండటంతో పాటు ప్రధాన నగరంలో ఉండటంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు ఆ స్థలంపై కన్నుపడింది. 2004లో అధికారంలోకి రాగా 2006లోనే ఆ బస్తీ నుంచి నిరుపేదల్ని వెళ్లగొట్టి గ్రేటర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అక్కడ నిర్మించాలని నిర్ణయించారు. ఆ మేరకు కార్యాలయానికి ఇందిరా భవన్ అని నామకరణం చేసి శిలాఫలకాన్ని కూడా తయారు చేయించారు. అయితే బస్తీవాసులకు దివంగత ఎమ్మెల్యే పీజేఆర్ అండగా నిలిచారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అయినప్పటికీ నిరుపేదల గూడును కూల్చివేస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ క్రమంలో బస్తీవాసులు హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం స్టే విధించింది. దీంతో బస్తీవాసులు ఇకతమకు ఇబ్బందిలేదని నిశ్చింతగా ఉండిపోయారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం అంతర్గతంగా పావులు కదుపుతూనే ఉంది. స్టే గడువు ముగిసే విషయంపై ఆ నిరుపేదలకు పెద్ద అవగాహన లేదు. దీనిని అదునుగా చేసుకొని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రికి రాత్రి వందలాది మంది పోలీసులు, బుల్డోజర్లతో బస్తీపై విరుచుకుపడింది. ఇంట్లో సామాను తీసుకునే సమయాన్ని కూడా ఇవ్వకుండా కొన్ని గంటల వ్యవధిలోనే పేదల ఇండ్లను నేలమట్టం చేసింది. అప్పటి ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ సర్కారు దమనకాండను తీవ్రస్థాయిలో వ్యతిరేకించి, నిరసన వ్యక్తం చేశాయి.

పార్కింగ్ కోసం వినియోగం

అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ స్థలం అటు నిరుపేదలకు, ఇటు ప్రభుత్వానికి ఉపయోగపడకుండా రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాభవన్ ఊసే మరిచిపోయింది. తిరిగి ఆ కుటుంబాలు వద్దామంటే ఉన్న గుడిసెలు, ఇండ్లు పూర్తిగా నేలమట్టం అయ్యాయి. దీంతో అప్పటి నుంచి ఇప్పటిదాకా పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. నుమాయిష్ జరిగినపుడు పోలీసులు ఆ స్థలాన్ని పార్కింగ్ స్లాటుగా వినియోగిస్తున్నారు. పరిసరాల్లో గాంధీభవన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయం, ఇతర కార్యాలయాలు ఉండటంతో చాలామంది అక్కడ వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నారు. మరోవైపు బస్తీవాసులు ఇప్పటికీ ఆ స్థలాన్ని తమకు కేటాయించాలని డిమాండు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఏం సాధించినట్టు?

ప్రశాంతంగా ఉన్న బస్తీని చెదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తదుపరి ఏం సాధించినట్టు? ఇప్పటికీ సమాధానంలేని ప్రశ్న ఇది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో వేలాది నిరుపేదల ఇండ్లు కూల్చివేస్తామని చెప్తున్నది. వారికి ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామంటున్నది. పేదల ఇండ్లు కూల్చివేసిన చోట ఆకాశహర్మ్యాలు నిర్మించి హైదరాబాద్‌ను సియోల్‌గా మారుస్తామని అంటున్నది. ఈ క్రమంలో ప్రభుత్వపరంగా ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా పబ్లిక్-ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ప్రాతిపదికన కార్పొరేట్ కంపెనీలకు తివాచీ పరిచి వాళ్లు పెట్టే పెట్టుబడులతో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం, మంత్రులు పేర్కొంటున్నారు. మూసీ మురికిని పోగొట్టేందుకు పేదల ఇండ్లను కూల్చడమెందుకు? అని ప్రశ్నించిన వారిని నల్లగొండ జిల్లావాసులకు మీరు వ్యతిరేమా? అని ఎదురు దాడికి దిగుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే, సుందరీకరణ కోసం కూల్చివేస్తామని చెప్తున్న ఆ ఇండ్లు హైదరాబాద్‌లో పుట్టి, పెరిగిన వారివి కావు. అందులో చాలామంది ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వచ్చి పైసా పైసా కూడబెట్టుకొని, గ్రామాల్లో ఉన్న తమ పొలాలను అమ్ముకొని నిర్మించుకున్నవి. ఈ క్రమంలో తదుపరి కార్పొరేట్ కంపెనీలు ఇక్కడ కొలువు తీరకపోతే, ఆ భూములు అటు బాధితులకు దక్కక, ఇటు ప్రభుత్వపరంగా ఉపయోగపడకుండా మరో భీంరావ్‌బాడ స్థలంగా మారుతాయా? అన్న ఆందోళన ప్రతి ఒక్కరిలోనూ వ్యక్తమవుతున్నది.

నేటికీ కొనసాగుతున్న పోరాటం

భీంరావుబాడ నుంచి ఆ నిరుపేద కుటుంబాలను అదే నియోజకవర్గం పరిధిలో ఉన్న అప్జల్‌సాగర్‌లోని వాంబే గృహాలకు తరలించారు. అక్కడ మంచి నీటి వసతి, డ్రైనేజీ, సరైన కరెంటు సరఫరా, రవాణా మార్గం వంటి కనీస మౌలిక వసతులు కల్పించకుండానే ఆ కుటుంబాలను అక్కడికి తరలించారు. వాంబే గృహాలకు సంబంధించి అప్పుడు పట్టాలు కూడా వారికి ఇవ్వలేదు. ఉపాధి కేంద్రంగా ఉన్న నాంపల్లి కూలీ అడ్డా దూరం కావడం, పిల్లల చదువులకు ఇబ్బందులు ఎదుర్కోవడం, మౌలిక వసతులు లేకపోవడంతో ఆ కుటుంబాలు నరకయాతన అనుభవించాయి. తిరిగి న్యాయ పోరాటం చేసి స్టే తెచ్చుకున్నాయి. ఈలోగా రెవెన్యూ శాఖ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసింది. తదనంతరం సీఎంగా ఉన్న వైఎస్ చనిపోవడంతో ఇందిరాభవన్ ప్రతిపాదన అటకెక్కింది.

కేసీ కెనాల్‌పై ఆంక్షలెందుకు పెట్టకూడదు?

- అక్కడ కేటాయింపులకు మించి నీటి వినియోగం
- జూరాల ప్రాజెక్టుపైనే ఆంక్షలకు కారణమేంటి?
- ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రశ్నలు
- సమాధానం చెప్పలేనని దాటవేసిన ఏపీ తరపు సాక్షి అనిల్‌కుమార్
- విచారణ డిసెంబర్ 4,5కు వాయిదా

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): కేసీ కెనాల్ నీటి వినియోగాల గణాంకాలను పరిశీలిస్తే.. కేటాయింపులకు మించి వినియోగాలున్నాయని, అయినప్పటికీ అక్కడ షరతులు విధించకుండా, కేవలం జూరాల ప్రాజెక్టు వద్దనే నీటి వినియోగంపై ఆంక్షలు పెట్టడం ఎందుకని తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ట్రిబ్యునల్‌లో ప్రశ్నలు లేవనెత్తారు. కేసీ కెనాల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ మరిన్ని నీళ్లు వినియోగించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ విధమైన ఆపరేషన్ ప్రొటోకాల్‌ను ప్రతిపాదించారని వాదించారు. దీనిపై ఏపీ తరపున సాక్షి అనిల్‌కుమార్ స్పందిస్తూ ట్రిబ్యునల్ 1కే8, కే9 సబ్‌బేసిన్ల మీద విధించిన ఆంక్షలు మాత్రమే పరిగణనలోకి తీసుకున్నానని బదులిచ్చారు. కేసీ కెనాల్ ప్రాజెక్టు సక్సెస్ రేట్‌ను అధ్యయనం చేయలేదని వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన కృష్ణాజలాలను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయడంతో పాటు ప్రాజెక్టులవారీగా కేటాయింపులకు సంబంధించిన జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ ఢిల్లీలో మూడవ రోజైన శుక్రవారం కొనసాగింది. ఏపీ తరపున ఆపరేషన్ ప్రొటోకాల్‌ను ప్రతిపాదించిన చీఫ్ ఇంజినీర్ అనిల్‌కుమార్ గోయెల్‌ను తెలంగాణ తరపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. కేసీ కెనాల్, వైకుంఠపురం, పులిచింతల ప్రాజెక్టులకు సంబంధించి నీటివాటాల పంపిణీ, నీటివినియోగం తదితర అంశాలపై గోయెల్ తన అఫిడవిట్‌లో ప్రతిపాదించిన అంశాలపై ప్రశ్నించారు.

కేసీకెనాల్ సక్సెస్ రేట్ అధ్యయనం చేశారా?

కేసీకెనాల్‌తోపాటు ఇతర ప్రాజెక్టుల తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను ఆపరేట్ చేయాలని చెప్పడానికి ప్రాతిపదిక ఏమిటని వైద్యనాథన్ ప్రశ్నించారు. అయితే కేవలం ఏపీ అధికారులతో జరిపిన చర్చల ఆధారంగానే ఆ ప్రతిపాదనలు చేసినట్టు అనిల్‌కుమార్ గోయెల్ వెల్లడించారు. కేసీ కెనాల్ ప్రాజెక్టు సక్సెస్ రేట్‌ను అధ్యయనం చేశారా? అని ప్రశ్నించగా, అదేమీ లేదని బదులిచ్చారు. పులిచింతల ప్రాజెక్టు ఇరు రాష్ట్రాల మధ్య సరిహద్దుగా ఉన్నదని, ప్రాజెక్టు కింద ఉన్న 95% ఆయకట్టు ఏపీదేనని, అదీగాక సాగర్ దిగువన క్యాచ్‌మెంట్ ఏరియా నుంచే 53టీఎంసీల మేరకు జలాలు పులిచింతలకు వచ్చి చేరుతాయని, అలాంటప్పుడు కేడీఎస్ (కృష్ణా డెల్టా సిస్టమ్)కు శ్రీశైలం, సాగర్ నుంచి జలాలు ఎందుకని వైద్యనాథన్ ప్రశ్నించారు. సమాధానం చెప్పలేనని ఏపీ తరపు సాక్షి అనిల్‌కుమార్ గోయెల్ దాటవేశారు. వైకుంఠపురం ప్రాజెక్టుపైనా అదే తరహాలోనే సమాధానమిచ్చారు. తదుపరి విచారణను డిసెంబర్ 4, 5తేదీలకు ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ వాయిదా వేశారు.

25 తర్వాతే బోర్డు మీటింగ్

కేఆర్ఎంబీకి ఏపీ సర్కారు వినతి

హైదరాబాద్, నవంబర్8 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన రూల్‌కర్వ్, ఆపరేషన్ ప్రొటోకాల్‌ను ఖరారు చేసేందుకు ఏర్పాటుచేసిన రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ)ని యథాప్రకారం కొనసాగించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయించింది. అందుకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించేందుకు ఎజెండాను కూడా ఇరు రాష్ట్రాలకు ప్రతిపాదించింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆర్ఎంసీ సమావేశాన్ని 25వ తేదీ తరువాతనే నిర్వహించాలని బోర్డుకు ఏపీ సర్కారు విజ్ఞప్తి చేసింది. దీంతో సమావేశాన్ని బోర్డు సైతం వాయిదా వేసింది.

ధాన్యం సేకరణ వేగవంతం: ఉత్తమ్

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వరి సేకరణపై శుక్రవారం సాయంత్రం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఉన్నతాధికారులు, మిల్లర్స్ ప్రతినిధులు హాజరయ్యారు. రైతుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. సన్నరకం వరిపై రైతులందరికీ క్వింటాల్‌కు రూ.500 అదనంగా బోనస్ అందజేయనున్నట్టు ఆయన ప్రకటించారు. మిల్లింగ్ చార్జీలు కూడా సన్నరకంపై రూ.40, ముతక వరికి రూ.30 పెంచినట్టు తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరగకుండా మిల్లర్లతో సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

శనగ విత్తనాలు @8,700

- క్వింటాల్‌కు 300 సబ్సిడీ
- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): యాసంగిలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని క్వింటాల్‌కు రూ.300 సబ్సిడీపై శనగ విత్తనాలను సరఫరా చేయనున్నట్టు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ హాకాభవన్‌లోని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర కార్యాలయంలో సంస్థ ఎండీ ఉదయ్‌కుమార్‌తో కలిసి సబ్సిడీ వివరాలను వెల్లడించారు. ఈ యాసంగి సీజన్‌లో రైతులకు కావాల్సిన శనగ జేజీ 11, జాకీ రకాల విత్తనాలను 20 వేల క్వింటాళ్ల వరకు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. క్వింటాల్ ధర రూ.తొమ్మిది వేలు ఉండగా, రూ.300 రాయితీ వస్తుందని, రైతులు రూ.8,700 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. యాసంగి వరి విత్తన రకాలు కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, జేజీఎల్ 27356, ఎంటీయూ 1010, కేఎన్ఎం 118, జేజీఎల్ 24423ను రైతులకు అందుబాటులో ఉంచేలా గ్రామాలకు చేర్చాలని ఆదేశించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో పత్తి వాహనాలు

పత్తి కాంటా.. తేమ తంటా!

మొదటిపేజీ తరువాయి...

కొంటున్నారు. పంటలో తేమశాతం 15 నుంచి 18 వరకు ఉండడంతో ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తున్నారు. 15 శాతం తేమ ఉంటే రూ.6510, 16 శాతం ఉంటే రూ.6440 చెల్లిస్తున్నారు. తేమశాతం నిర్ధారణపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రూ. 25 వేల నష్టం

నేను ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు ట్రాక్టర్‌లో 26 క్వింటాళ్ల పత్తిని విక్రయించడానికి తీసుకు వచ్చాను. సీసీఐకి పత్తిని విక్రయిస్తే మద్దతు ధర వస్తుందని వచ్చిన నాకు నిరాశే ఎదురైంది. పంటలో తేమ ఎక్కువ ఉందని సీసీఐ అధికారులు కొనుగోలుకు నిరాకరించారు. పంటను తిరిగి ఇంటికి తీసుకుపోలేని పరిస్థితులు ఉండగా ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని విక్రయించారు. వాళ్లు క్వింటాల్‌కు రూ.6600 చెల్లించారు. 26 క్వింటాళ్లకు నాకు రూ.25 వేల నష్టం జరిగింది.

- మల్లేశ్, తలమడుగు, ఆదిలాబాద్ జిల్లా

రైతుల గోస వినేటోళ్లు లేరు

నేను 15 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. ఎకరానికి 10 క్వింటాళ్ల పత్తి వచ్చింది. పంటను నాలుగు రోజులు ఎండబెట్టి 22 క్వింటాళ్లు ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చా. 15 శాతం తేమ ఉంది తీసుకోబోమని సీసీఐ అధికారులు అన్నారు. మార్కెట్ అధికారులను దగ్గరికి పోయి సమస్య తెలిపినా వాళ్లు ఏమి చేయలేమని చెప్పారు. చేసేదేమీ లేక తక్కువ ధరతో ప్రైవేట్ వ్యాపారులకు పంటను అమ్ముకోవాల్సి వచ్చింది.

- హన్మాండ్లు, లేఖర్‌వాడ, జైనథ్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని నిలదీస్తున్న రైతులు

తూకంలో మోసం.. రైతుల ఆగ్రహం

సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి నిలదీత

కరీంనగర్ రూరల్, నవంబర్ 8: ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మోసంపై కరీంనగర్ నగర శివారులోని తీగలగుట్టపల్లి రైతులు కన్నెర్రజేశారు. బస్తాకు 40.600 కిలోలు తూకం వేయాల్సిన నిర్వాహకులు, కిలోన్నర వడ్లు అదనంగా తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని నిలదీశారు. మమ్మల్ని ముంచొద్దని, తాలు పేరిట మరీ ఇంత మోసం చేస్తారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు ఒరిగిందేమీ లేదని, ఎక్కడ చూసినా తీరని అన్యాయమే జరుగుతుందని మండిపడ్డారు. కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, మూల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలో మావోయిస్టుల కదలికలు?

- అప్రమత్తమైన పోలీస్‌శాఖ
- హెచ్చరికల నేపథ్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు భద్రతపెంపు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మావోయిస్టుల కదలికను పోలీస్ వర్గాలు గుర్తించినట్టు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్ర బలగాలు భీకర దాడులు చేస్తుండటంతో మావోయిస్టులంతా సరిహద్దు దాటి తెలంగాణలోకి వస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో కేంద్ర కమిటీ సభ్యులు కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు. దీనిపై ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల ఎస్పీలు అప్రమత్తమయ్యారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఎస్పీల ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచే పోలీస్ బలగాలు కూంబింగ్‌ను మొదలుపెట్టినట్టు సమాచారం. మావోయిస్టు సానుభూతిపరులపై కూడా నిఘా పెట్టినట్టు తెలు